న్యూస్ బాక్స్

ఆర్థికంగా బలోపేతం కావాలి

పెద్దపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీనిధి రుణాలను వినియోగించుకుని మహిళా సంఘం సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని అదనపుకలెక్టర్ జే. అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. పేద మహిళా సంఘ సభ్యులకు ప్రభుత్వం శ్రీ నిధి సంస్థ ఏర్పాటు చేసిందని, మహిళా సంఘ సభ్యులకు రుణాలను అందేవిధంగా శ్రీనిధి, మెప్మా సిబ్బంది చూడాలన్నారు. జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి సుల్తానాబాద్, మంథని పట్టణ ప్రాంతాలలో మొత్తం 213మహిళ సమాఖ్యలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు 6కోట్ల 11లక్షల రుణాలను శ్రీ నిధి ద్వారా అందించామని, రామగుండం పట్టణ సమాఖ్యలో 13 సంవత్సరాల తర్వాత శ్రీనిధి రుణాలు అందుబాటులోకి తెచ్చామని, పెద్దపల్లి పట్టణ మహిళ సమాఖ్యలోని సీహెచ్ స్వతంత్ర భారతి శ్రీ నిధి ద్వారా 3 లక్షల రూపాయల సౌభాగ్య రుణం పొంది కిరాణా షాపు పెట్టుకున్నారని, సుల్తానాబాద్ మహిళా పట్టణ సమాఖ్య చెందిన కొండా రాధా శ్రీనిధి సంస్థ ద్వారా మూడు లక్షల రూపాయల సౌభాగ్య రుణం పొంది బోటిక్,టైలరింగ్ జీవనోపాధి పెట్టుకున్నారన్నారు. రామగుండం పట్టణసమాఖ్య అధ్యక్షురాలు లతామోహన్ అధికారుల చొరవతో 13ఏళ్లతర్వాత ఈ ఆర్థిక సంవత్సరంలో శ్రీనిధి రుణాలు అందించడం ప్రారంభించారని, దీనివల్ల తక్కువ వడ్డీకి శ్రీనిధి రుణాలు లభిస్తాయనితెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కోల్‌సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రామగుండం కార్పొరేషన్ 43వ డివిజన్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులతో అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. రూ. 80లక్షల నిధులతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, గట్ల రమేష్, పాతిపెల్లి ఎల్లయ్య, గట్ల రమేష్‌లు పాల్గొన్నారు. నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు గట్ల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు సొల్లు రామస్వామి, రామకృష్ణ, స్వరాజ్, ఆడెపు కృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్‌లో సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 150 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాస్ వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం తిరుపతి మాట్లాడుతూ సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికులకు చాలా ఏళ్లుగా తమ ఆసుపత్రిలో రెఫరల్ సేవలు అందిస్తున్నామన్నారు. కాలనీల్లోని కార్మికులకు వైద్యాన్ని అందుబాటులోకి తేవాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్పొరేటర్ కల్వల శిరీషసంజీవ్, కోట కరుణాకర్, బొంగోని హరీష్, యూనస్ పాల్గొన్నారు.

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో కొనసాగుతున్న విచారణ
- పూర్తి కావస్తున్న జాయింట్ సర్వే
- వంద ఎకరాలకు పైగా కబ్జా చేసి 30 చెరువులు నిర్మించారని గుర్తింపు?



ఎల్లంపల్లి భూముల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన చెరువులను పరిశీలిస్తున్న ఈఈ స్వామి(ఫైల్)

'ఎల్లంపల్లి' భూముల కబ్జాపై కదులుతున్న డొంక

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎల్లంపల్లి ప్రాజెక్టు భూముల కబ్జా వ్యవహారంలో డొంక కదులుతోంది. గతనెల 20న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఎల్లంపల్లి భూముల కబ్జా' కథనంపై కలెక్టర్ ఆదేశాల మేరకు నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులు చేపట్టిన జాయింట్ సర్వే పూర్తి కావచ్చింది. ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్‌లోని భూములను కబ్జా చేసి అడ్డుగా కట్టలు వేసి చెరువులను నిర్మించి చేపలు పెంచుతున్నది నిజమేనని సర్వేలో తేటతెల్లం అయ్యినట్లు సమాచారం. దాదాపు వంద ఎకరాలకు పైగా అక్రమార్కులు ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ భూములను ఆక్రమించి చేపల చెరువులు చేపట్టినట్లు సర్వేలో తేలిందని తెలిసింది. ఎఫ్‌టీఎల్ వరకు హద్దురాళ్ల పాతగా వంద ఎకరాలకు పైగా ప్రాజెక్టు భూములు కబ్జా చేశారని తెలుస్తున్నది. ఈ చేపల చెరువులను ఐదేళ్ల క్రితమే తవ్వి అక్రమార్కులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని సమాచారం. ఈ వ్యవహారం నీటి పారుదల శాఖాధికారులకు తెలియకుండానే జరుగుతున్నదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అక్రమార్కులు ఆయా శాఖల అధికారులను మచ్చిక చేసుకునే దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తున్నది. జిల్లాలోని అంతర్గాం మండలంలో గల శ్రీపాద ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో పొట్యాల నుంచి ముర్మూర్ వరకు సోమనపల్లి కేంద్రంగా వంద ఎకరాలకు పైగా చేపల చెరువులను నిర్మించారు. పొట్యాల, సోమనపల్లి, అకెనపల్లి, ముర్మూర్ రెవెన్యూ శివారుల్లోని శ్రీపాద ప్రాజెక్టు భూముల్లో ఈ దందా కొనసాగుతున్నది. అక్రమ దారులు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని కబ్జా చేసి పెద్దగా మట్టి కట్టలు పోసి 30 నుంచి 40 చెరువులను నిర్మించి ప్రాజెక్టు నుంచి పైపులైన్లు వేసి అక్రమంగా నీళ్ల వాడుకోవడంతో పాటు కరెంట్‌ను కూడా వాడుకుంటున్నారు. అక్రమార్కులు కొంత పట్టా భూములను స్థానికుల నుంచి లీజుకు తీసుకుని ఎక్కువ మొత్తంలో ప్రాజెక్టు కోసం సేకరించిన భూములను కబ్జా చేసి దర్జాగా చేపల వ్యాపారం చేపట్టారు. ప్రతి ఏటా 50 నుంచి 100 కోట్ల రూపాయల టర్నోవర్ గల వ్యాపారం చేసి కోట్లు గడించినట్లు సమాచారం.

- అధికారుల తీరుపై అనుమానాలు

ప్రాజెక్టు బ్యాక్ వాటర్ భూములను కబ్జా చేసి చెరువులు తవ్వి వ్యాపారం చేస్తున్న వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పందించి జాయింట్ సర్వేకు ఆదేశించారు. వారం రోజుల నుంచి అంతర్గాం మండల తహసీల్దార్ తూము రవీందర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు డీఈఈ బుచ్చిబాబు, సర్వేయర్, తదితరులు జాయింట్ సర్వే చేపట్టారు. ఈ సర్వే కోసం అధికారులు పోలీస్ ప్రొటెక్షన్ తీసుకుని సర్వే చేశారంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థంచేసుకోవచ్చు. ప్రాజెక్టు ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించిన అధికారులు 30 చేపల చెరువులను కొంత పట్టా భూములను కలుపుకుని ఎక్కువగా ప్రాజెక్టు భూముల్లోనే నిర్మించినట్లు గుర్తించారు. నీళ్ల ఉండడం వల్ల ఎంత విస్తీర్ణంలో ప్రాజెక్టు భూములు కబ్జా అయ్యింది తేల్చలేకపోతున్నారు. దాదాపు 100 ఎకరాలకు పైగానే భూములను కబ్జా చేసినట్లు గుర్తించారని సమాచారం. ఈ భూములను ఎవరెవరు కబ్జా చేసి అక్రమంగా చేపల వ్యాపారం చేస్తున్నారో

మిగతా 8వ పేజీలో...

మంథని పట్టణ అభివృద్ధికి ప్రణాళికలు..

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు మంథనిలో పలు అభివృద్ధి పనులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి మంథని పట్టణంలో పర్యటించి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ. 24 కోట్ల5 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉద్దేశంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ. 30 కోట్లతో రోడ్లు, డ్రైయిన్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇప్పుడు పురపాలక కార్యాలయం, డంపింగ్‌యార్డ్‌లో సెగ్రిగేషన్ షెడ్, కంపోస్ట్‌షెడ్, ఆఫీసురూమ్, సెక్యూరిటీ రూమ్, టాయిలెట్స్, వేయింగ్‌బ్రిడ్జ్ పెద్దపల్లి, గోదావరిఖని, కాటారం నుంచి మంథని పట్టణానికి వచ్చేరోడ్డు ప్రారంభంలో ఆర్చిలను రూ.9కోట్ల20లక్షలతో చేపట్టామన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో శ్రీరామ్‌నగర్ నుంచి మాత శిశువు హస్పిటల్, పోచమ్మవాడనుంచి గోదావరిఖని క్రాస్‌రోడ్, గిట్లరమణారెడ్డి విగ్రహం, కూచిరాజుపల్లి క్రాస్‌రోడ్ వద్ద రూ.6కోట్ల71 లక్షలతో సెంట్రల్‌లైటింగ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. పట్టణంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం, సీసీరోడ్లు, డ్రైయిన్ నిర్మాణ పనులను రూ.8కోట్ల14లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించామన్నారు. మొత్తం పట్టణంలో రూ. 24కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం మంత్రి ఆలింకో సంస్థ నిర్వహించిన క్యాంపులో ఎంపిక కాబడిన దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ రాజయ్య, ఈఈ సంపత్, ఏఈ మౌనిక, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'ఐపాస్' పుస్తక ఆవిష్కరణ

కోల్‌సిటీటౌన్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ గాంధీపార్క్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐపాస్ ప్రశ్నావళి పుస్తకాన్ని ఎంఈఓ మాధవి ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడారు. రాష్ట్రంలోని ఆంగ్ల రిసోర్స్ పర్సన్స్ రూపొందించిన ఇంటెన్స్ ప్రాక్టీస్ ఎయిమ్స్ షూర్ సక్సెస్ (ఐపాస్) పుస్తకం ప్రతి యూనిట్ నుండి రీడింగ్ ప్యాసేజ్, గ్రామర్, సృజనాత్మకత రచనలు ప్రశ్నలు రూపొందించినట్టు ఆమె పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఈపుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పీఎం షేక్, గడ్డం జగదీష్, అశోక్, జిల్లాకు చెందిన ఇంగ్లీష్ టీచర్లు హరీష్, కనకయ్య, రవీందర్, సునీల్, వెంకటేష్, గోపి, ఉమ, మధుకర్, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పెద్దపల్లి ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ అన్నారు. ఉమ్మడి జిల్లా సీనియర్ ఖోఖో క్రీడాకారులకు 15 రోజుల నుంచి పెద్దపల్లి ఐటీఐ కళాశాల మైదానంలో శిక్షణ ఇచ్చారు. లయన్స్‌క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్‌లను అందించగా సీఐ అనిల్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల సురేందర్, సంపత్‌రావు, లక్ష్మణ్, వినోద్, అనిల్, వెంకటరెడ్డి, లక్ష్మణ్, వెంకన్న, రాములు, నక్క శ్రీనివాస్‌తో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

కోతల్లేకుండా ధాన్యం కొనుగోలు చేశాం..

జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ రెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పెద్దపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గడిచిన వానాకాలం సీజన్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి కోతలు లేకుండా కొనుగోళ్లు సాఫీగా జరిగాయని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఆంధ్రజ్యోతి: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు ఎలా జరిగాయి?

డీఎం: వానాకాలం సీజన్లో జిల్లా వ్యాప్తంగా 321 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. వీటి ద్వారా ఇప్పటివరకు 688 కోట్ల 83 లక్షల రూపాయల విలువైన 2,97,045.27 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. దాదాపుగా కొనుగోలు పూర్తి కావచ్చాయి.

ఆంధ్రజ్యోతి: రైతులకు చెల్లింపులు ఏ మేరకు చేశారు?

డీఎం: ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ఎప్పటికప్పుడు ట్రక్ షీట్లు పూర్తి చేసి ట్యాబ్లో రైతుల వివరాలను నమోదు చేశామన్నారు. 48 గంటల్లోగా కార్పొరేషన్ ద్వారా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఇప్పటివరకు 99 శాతం 680 కోట్ల 26 లక్షల రూపాయలు 53,114 మంది రైతుల ఖాతాలో జమ చేశాం.

ఆంధ్రజ్యోతి: సన్నరకం వరి ధాన్యాన్ని ఎంత కొనుగోలు చేశారు?

డీఎం: సన్న రకం వరి ధాన్యాన్ని పండించే రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో ఎక్కువగా సన్నరకం వరి పంటను రైతులు సాగు చేశారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు 2,97,045.27 టన్నుల ధాన్యం రాగా, ఇందులో 2,30,899 టన్నుల సన్నరకం కొనుగోలు చేశాము, దొడ్డు రకం ధాన్యం 66,146 టన్నులు కొనుగోలు చేశాం. సన్న ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలో ఖమ్మం జిల్లా తర్వాత రెండవ స్థానంలో పెద్దపల్లి జిల్లా ఉంది.

ఆంధ్రజ్యోతి: సనరకం ధాన్యానికి రైతులకు ఎంతవరకు బోనస్ చెల్లించారు.

డీఎం: జిల్లా వ్యాప్తంగా 38,327 మంది రైతులకు 115 కోట్ల 2 లక్షల రూపాయల బోనస్ చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 26,653 మంది రైతులకు 85 కోట్ల 34 లక్షల రూపాయలు చెల్లించాం. ఇంకా 11,674మంది రైతులకు 29 కోట్ల 68 లక్షల రూపాయల బోనస్ వారం రోజుల్లోగా చెల్లింపులు పూర్తి కానున్నాయి.

ఆంధ్రజ్యోతి: వరి ధాన్యం కొనుగోలు కోతలు విధించారా?

డీఎం: జిల్లాలో ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలో గానీ, రైస్‌మిల్ పాయింట్ల వద్ద కానీ కొనుగోలు చేసిన వారి ధాన్యంలో కోతలు విధించలేదు. కోతలు విధిస్తే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని జారీచేసిన హెచ్చరికల మేరకు ఎక్కడా కూడా కోతలు విధించినట్లుగా తమకు రైతుల నుంచి ఫిర్యాదులు అందలేదు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో సీఎంఆర్ ఎందుకు ముందుకు సాగడం లేదు?

డీఎం: అలాంటిదేమీ లేదు. ఆయా రైస్ మిల్లులకు సీఎంఆర్ కింద ఇచ్చిన వరి ధాన్యాన్ని మరాడించి బియ్యంగా ఇచ్చేవిధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. 2023-24 వానాకాలం సీజన్‌కు సంబంధించి 29 వేల టన్నుల బియ్యం సీఎంఆర్ కింద రావాల్సి ఉన్నాయి. అలాగే యాసంగి సీజన్‌కు సంబంధించి 76 వేల టన్నుల బియ్యం రావాల్సి ఉన్నాయి. సీఎంఆర్ పూర్తిచేసేందుకు ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు విధించింది. ఆ మేరకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ మొదలయ్యింది. ఇప్పటికే 20వేల టన్నుల బియ్యాన్ని డెలివరీ చేశాం.

ఆంధ్రజ్యోతి: సన్నధాన్యానికి సంబంధించి జిల్లాకు అలాట్ మెంట్ ఎంత ఇచ్చారు?

డీఎం: జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించగా వచ్చే బియ్యంలో 90 శాతం జిల్లాకే కేటాయించారు.

ఆంధ్రజ్యోతి: రేషన్ వినియోగదారులకు సన్న బియ్యం పంపిణీ ఎప్పటి నుంచి చేపట్టనున్నారు?

డీఎం: రేషన్ వినియోదాలకు సన్న బియ్యం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఎప్పటి నుంచి బియ్యం పంపిణీ చేయాలనే విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు.

ఆంధ్రజ్యోతి: ధాన్యం కొనుగోళ్ల కమిషన్ ఎంత పెండింగ్‌లో ఉంది?

డీఎం: వానాకాలానికి సంబంధించి 1,71,87,260 రూపాయలు, యాసంగి సీజన్‌కు సంబంధించి 10,60,77,020 రూపాయలు పెండింగ్‌లో ఉన్నా యి. ఈ నిధులు విడతల వారీగా చెల్లించనున్నారు.

రైల్వే ఫ్లైఓవర్ స్థల పరిశీలన



రూపునారాయణపేటలో భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

ఓదెల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శానగొండ అనుబంధ గ్రామం గొల్లపల్లి రైల్వే గేట్ నుంచి రూపునారాయణపేట వరకు నిర్మించనున్న రైల్వే ఫ్లైఓవర్ రోడ్డు కోసం మంగళవారం ఆర్డీవో గంగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వే రోడ్డు నిర్మాణానికి దాదాపు 6 ఎకరాల భూములు అవసరం ఉండగా రైతులను భూముల విషయంలో రైతులను అడిగితెలుసుకున్నారు. ఫ్లైఓవర్ రోడ్డుకు భూములు ఇచ్చేది లేదని రైతులు ఆర్డీవోకు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ యాకయ్యతో పాటు పలువురు ఉన్నారు.

మొక్కల రక్షణ బాధ్యతగా తీసుకోవాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కలిందిని



హన్మంతునిపేట పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కలిందిని

8

బీజేపీ కార్యాలయంపై దాడికి నిరసన..



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

8

రైతులను దగా చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

-ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దఎత్తున దగా చేసిందని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆరోపించారు. స్థానిక ఆర్కే. గార్డెన్లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతు, రుణ మాఫీ పథకాలతో రైతులను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 10శాతం మంది సన్నకారు రైతులకు సంక్షేమాన్ని అందించి పెద్దఎత్తున్న దోచుకున్నట్లు వివరించారు. రెవెన్యూ చట్టాలను కాలరాస్తూ ధరణి తీసకువచ్చి పెత్తదార్లుకు, భూస్వాములకు మళ్లీ హక్కులు కల్పించి వారికి దోచిపెట్టారని ఆయన స్పష్టం చేశారు. రైతుల మధ్య వివాదాలు సృష్టించి వందలాది ఎరాలున్నవారికే రైతుబంధు వర్తించిందన్నారు. గుట్టలు, రాళ్ళు రప్పలు రియల్ ఎస్టేట్ వెంచర్లు, రహదారులకు రైతుబంధు కట్టబెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు మొసలికన్నీళ్ళు కారుస్తూ రైతుల పక్షాన పోరాటం చేస్తున్నామని తప్పుదారి పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణ మాఫీ విడత వారికి చెల్లించడంతో తెచ్చిన రుణానికి వడ్డీలకే సరిపోయి రైతు రుణాలు రెన్యూవల్ కాక తీవ్ర ఇబ్బందులు పడ్డ సంగతి రైతులకు తెలుసన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. పంటలు పండించే ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షలు నిర్వహించి నిర్ణయం తీసుకుంటున్నారన్నారు. ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేశామని, పంట పండించే రైతులకు రుతు భరోసా కింద ఆరువేల రూపాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్ ఈరేస్ ఫార్ములా కేసులో కేటీఆర్ నిజాయితీని నిరూపించుకోవాలంటే ఏసీబీ విచారణకు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, మినూపల ప్రకాష్‌రావు, పట్టణ కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, భుతగడ్డ సంపత్, బండారి రామ్మూర్తి, సందనవేమీ రాజేందర్, తూముల సుభాష్, ఆశ్రాఫ్, సయ్యద మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, కుమార్, గాజుల రాజమల్లు, సామ రాజేశ్వర్‌రెడ్డి, మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, శ్రీగిరి శ్రీనివాస్, అల్ల సుమన్ రెడ్డి, దుగ్యాల సంతోష్ రావు, సర్వర్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి : డీపీవో

ధర్మారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా సకాలంలో పన్నులు చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని డీపీవో వీర బుచ్చయ్య అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని మాల్లాపూర్ గ్రామపంచాయతీతోపాటు మండల కేంద్రంలోని మినీ గురుకుల పాఠశాలను పరిశీలించి కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. మొదట మల్లాపూర్ గ్రామపంచాయతీలోని సెక్రిగేషన్ షెడ్డు, నర్సరీలను సందర్శించిన అనంతరం గ్రామంలో శానిటేషన్, తాగునీటి సరఫరా గురించి ఆరాతీశారు. పంచాయతీ పరిధిలోని పెట్రోల్ బంకులో 22,878 రూపాయల ట్యాక్స్‌ను వసూలు చేశారు. జక్కన్నపల్లిలోగల మినీ గురుకుల పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు బోధన, భోజన సదుపాయాల గురించి ప్రిన్సిపాల్ శ్రీలతను అడిగితెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వెంట డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్, ఎంపిడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో రమేష్, ఏపీఓ రవి ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం : కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం కలెక్టర్ కలెక్టరేట్లో వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం, ఎన్‌సీడీ సర్వే, డయాగ్నొస్టిక్ హబ్, ఎంఎల్‌హెచ్‌పీ పని తీరు వంటి పలు అంశాలపై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల ద్వారా గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా పర్యవేక్షణ జరగాలని, ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను రెగ్యులర్‌గా మానిటర్ చేయాలన్నారు. గర్భిణులకు రెగ్యులర్‌గా చెకప్ సకాలంలో జరగాలని, ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ 100 శాతం కావాలన్నారు. జిల్లాలో ఎన్‌సీడీ సర్వే బాగా జరుగుతుందని, ఇప్పటివరకు 92శాతం సర్వే పూర్తయిందని, జనవరి నెలాఖరు వరకు మిగిలిన సర్వే పూర్తిచేసి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అవసరమైన వారికి మందులు అందేలా చూడాలని తెలిపారు. డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా ప్రస్తుతం 5 గంటల 20 నిమిషాల వ్యవధిలో ఫలితాలు అందిస్తున్నామని, దీనిని 4గంటలకు తగ్గించేందుకు ప్రణాళికలు తయారుచేయాలని సూచించారు. పరీక్ష నమూనాలు టీ హబ్‌కు త్వరగా చేరుకునేలా రవాణా వ్యవస్థ రీఆర్గనైజ్ చేసుకోవాలన్నారు. ఆర్‌బీఎస్‌కే బృందాల పిల్లలకు ఉన్న సమస్యలు గుర్తించడంతో పాటు వాటికి చికిత్స అందించడం కూడా చాలా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.

నేత కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గోవిందు రాజు(43) అనే నేత కార్మికుడు మంగళవారం క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గోవిందు రాజు ఏడాది క్రితం వరకు పవర్‌లూం కార్మికుడిగా పని చేసేవాడు. ప్రస్తుతం కూలీ పనులకు వెళ్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచూ డబ్బులు ఇవ్వాలంటూ భార్యను వేధించడంతో గొడవలు తలెత్తాయి. రోజులాగే బయటకు వెళ్లిన రాజు మద్యం తాగి వచ్చి భార్యను, కుటుంబ సభ్యులను ఇంట్లో నుంచి బయటకు పంపించాడు. తలుపులు వేసుకొని క్షణికావేశంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గోవిందు రాజు భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

కత్తిపోట్లకు గురైన వ్యక్తి మృతి

కోల్‌సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గత నెల 31న కత్తిపోట్లకు గురైన నంది శ్రీనివాస్(37) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో శ్రీనివాస్ మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ మేనకోడలి భర్త అయిన గొల్ల శ్రావణ్ జూనియర్ కళాశాల మైదానానికి మాట్లాడుదామని శ్రీనివాస్‌ను తీసుకెళ్లి హత్యాయత్నంకు పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నిందితుడు గొల్ల శ్రావణ్‌ను పోలీసులు ఘటన జరిగిన రోజే అరెస్టు చేశారు. శ్రీనివాసే తన భార్యను దూరం చేస్తున్నాడని కక్ష పెంచుకుని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన గొల్ల శ్రావణ్ ఆరు సంవత్సరాల క్రితం గోదావరిఖని వినోభానగర్‌కు చెందిన కాళ్ల పూజను ప్రేమ వివాహం చేసుకోగా, వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు.

సుల్తానాబాద్ కేంద్రంగా
బియ్యం అక్రమ రవాణా

- రేషన్ షాపుల వద్దే బహిరంగంగా కొనుగోళ్లు
- లారీల కొద్దీ పట్టుబడుతున్న వైనం
- నామమాత్రపు కేసులతో సరిపెడుతున్న అధికారులు


సుల్తానాబాద్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

సుల్తానాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. సుల్తానాబాద్ కేంద్రంగా ఇటు కరీంనగర్, అటు మహారాష్ట్రకు జోరుగా అక్రమ రవాణా సాగుతోంది. సుల్తానాబాద్‌తో పాటు సమీప గ్రామాలు, మండలాలు నుంచి బియ్యాన్ని సేకరించి మండలంలో నిల్వచేస్తున్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన పలు కుటుంబాల వారు రేషన్ బియ్యం సేకరణ, అక్రమ నిలువ, అక్రమ తరలింపును వృత్తిగా చేసుకున్నారు. చాలామంది ఆటోలు, ఇతర వాహనాల ద్వారా సుల్తానాబాద్‌తో పాటు సమీప మండలాల్లో తిరుగుతూ సబ్సిడీ బియ్యాన్ని కొంటున్నారు. ప్రతీ నెలా బియ్యం ఇచ్చే రోజుల్లో రేషన్ షాపుల వద్ద వీరు లబ్ధిదారులు నుంచి కొంటున్నారు. కిలోకు 15 లేదా 14 రూపాయల చొప్పున లబ్ధిదారులకు చెల్లిస్తున్నారు. ఈ బియ్యాన్ని పెద్ద మొత్తంలో ఇక్కడ నుంచి తరలించి మహారాష్ట్రలో కిలో 25 నుంచి 30 రూపాయలకు అమ్ముకుంటున్నారు. సుల్తానాబాద్‌తో పాటు కొదురుపాక, దేవునిపల్లి, గొల్లపల్లి, కదంబాపూర్, బొంతకుంటపల్లిల్లో తదితర గ్రామాల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వ కేంద్రాలు అధికంగా ఉన్నాయని సమాచారం. గతంలో అనేక సార్లు అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యంను అధికారులు పట్టుకున్నారు. సుల్తానాబాద్‌లోని రైస్ మిల్లుల ప్రాంతంలో కొందరు మిల్లర్లు సైతం ఈ దందాలో భాగస్వాములుగా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● మహారాష్ట్రకు తరలింపు..


ఐతరాజ్‌పల్లి వద్ద సబ్సిడీ బియ్యాన్ని పట్టుకున్న సివిల్ సప్లై అధికారులు(ఫైల్)

సుల్తానాబాద్ తదితర ప్రాంతాల నుంచి సేకరించిన సబ్సిడీ బియ్యాన్ని లారీలు, వ్యాన్ల ద్వారా కరీంనగర్ వంటి పట్టణాలకు తరలిస్తున్నారు. మరికొందరు పెద్దపల్లి మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఒక్కో లారీ లోడ్ బియ్యానిన అక్రమంగా తరలించి విక్రయించడం ద్వారా లక్షా ఇరవై వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

● దళారులు సమాచారం ఇస్తేనే...

చాలా కాలంగా సుల్తానాబాద్ కేంద్రంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవణా జోరుగా సాగుతోంది. బహిరంగంగా రేషన్ బియ్యాన్ని సేకరించడం, రాజీవ్ రహదారికి ఇరుపక్కల, మార్కండేయ కాలనీ, సుద్దాల గొల్లపల్లి రోడ్డు ప్రాంతాల్లో నిల్వ చేయడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బియ్యం అక్రమ రవాణా సమాచారాన్ని అధికారులకు, విలేకరులకు చేర వేస్తున్నారనే కారణంగా అనేక గొడవలు జరిగాయి. కొన్ని సందర్భాల్లో దళారుల మధ్య వ్యాపారంలో మనస్పర్థలు వచ్చిన సందర్భంలో బియ్యం అక్రమ రవాణా, నిలువ సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు అందించేవారు. దాంతో అధికారులు తనిఖీలు చేసి కేసు నమోదు చేసేవారు. అయితే అడపాదడపా తనిఖీలు చేసి, మొక్కుబడిగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కల్వర్టులను తనిఖీ చేసిన బాంబు స్క్వాడ్

చందుర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిగడ్డ గ్రామం నుండి లింగంపేట అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారిలో బాంబుస్కాడ్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా మంగళవారం తనిఖీలు చేశారు. ముఖ్యంగా కల్వర్టులను, రోడ్లను అణువణువు తనిఖీ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో బాంబుస్కాడ్ తనిఖీలతో ఏమి జరిగిందో తెలియక గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో లింగంపేట అటవీ ప్రాంతంలో వేములవాడ కోరుట్ల ప్రధాన రహదారిపై మావోయిస్టు నక్సల్స్ పేల్చిన మందు పాతరలో, అప్పటి చందుర్తి ఎస్ఐ దుర్మరణం చెందాగా పలువురు పోలీసులు గాయపడ్డారు. మళ్లీ ఈ ప్రాంతంలో బాంబు స్క్వాడ్ తనిఖీలు జరుగుతుండడంతో ప్రజల్లో నెలకొంది. వీఐపీల భద్రతలో భాగంగా కల్వర్టులను తనిఖీలు చేపట్టినట్లు పోలీసు పేర్కొన్నారు.

భార్యాభర్తల మధ్య ముదిరిన గొడవ

● ఒకరిపై ఒకరు దాడి ● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

వేములవాడ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తరచూ గొడవకు దిగుతున్న భర్తను భార్య మందలించడంతో గొడవ తలెత్తి ఒకిపైఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో భర్త మృతి చెందగా భార్య పరిస్థితి విషమంగా మారింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన రౌతు మహిపాల్ (47), సుజాత కూలీ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. మహిపాల్ మద్యానికి అలవాటు పడ్డాడు. మద్యం తాగి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం భార్యాభర్తల మధ్య గొడవ తలెత్తి ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. స్కూల్ నుంచి పిల్లలు ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇద్దరూ అపస్మారక స్థితిలో రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించేలోపు మహిపాల్ మృతి చెందాడు. భార్య సుజాతకు తీవ్రగాయాలవడంతో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

గొల్లపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామంలో జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సుద్దాల సాయికుమార్ (26) అనే యువకుడు గంజాయి తరలిస్తుండగా ఎస్సై చిర్ర సతీష్ కుమార్ మంగళవారం పట్టుకున్నారు. గ్రామంలో గంజాయిని విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి గ్రామంలో మాటు వేశారు. ఈ క్రమంలో సాయికుమార్ తన ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడగా అతడి వద్ద 270 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. యువకుడిని అదుపులోకి తీసుకున్నందుకు పోలీసు ఉన్నతాధికారులు ఎస్సై చిర్ర సతీష్ కుమార్‌ను, పోలీసు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వేణు, తిరుపతి, పూర్ణసాయి, రాజమౌళి, మహేష్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణల్లో సింగిల్ విండో చైర్మన్ అరెస్టు

తంగళ్లపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూమి అక్రమంగా పట్టా చేసుకున్న నేరెళ్ల సింగిల్ విండో చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని సర్వే నెంబర్ 365ఇ/1 లో 20 గుంటల స్థలాన్ని అక్రమంగా పట్టా చేసుకోవడానికి సహకరించిన రెవెన్యూ అధికారులపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా అసైన్డ్ భూమి అక్రమంగా పట్టా చేసుకున్న మరికొంత మందిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. పలువురు బీఆర్ఎస్ నాయకుల ఇండ్లపై దాడులు నిర్వహించినట్లు సమాచారం. పోలీసులు అరెస్ట్ చేస్తారనే సమాచారంతోనే కొందరు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.

ముంబాయిలో దుమాలవాసి మృతి


రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన కానపురం రాజు (42) ముంబాయిలో భవన నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. దుమాలకు చెందిన రాజు ఉపాధి నిమిత్తం భార్యాపిల్లలతో కలిసి 15 ఏళ్ల కిందట ముంబాయికి వలస వెళ్లా డు. అక్కడ భవన నిర్మాణ కార్మికుడుగా పని చేస్తున్నాడు. భవనంపై పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయాడు. మృతుడికి భార్య ఉష, కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక భార్యాపిల్లలు దిక్కులు చూడాల్సి వస్తోందని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. దాతలు మానవత ధృక్పథంతో స్పందించి సాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి


భీమయ్య (ఫైల్)

చిగురుమామిడి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండలో మంగళవారం ఇదే గ్రామానికి చెందిన గంద్రతి భీమయ్య(55) అనే రైతు ట్రాక్టరు బోల్తా పడి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించిన వివారాలు ఇలా ఉన్నాయి... భీమయ్య తన వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టరు డబ్బాను తీసుకుని గ్రామ పరిధిలోని బండారుపల్లికి చేందిన వెంకటయ్య అనే రైతుకు అప్పగించి ట్రాక్టరు ఇంజన్‌తో తిరిగి వస్తున్నాడు. రాయిని చెరువు వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో భీమయ్యకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై బండి రాజేశ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు , కుమారుడు ఉన్నారు. మృతుడు మున్నూరు కాపు అధ్యక్షుడిగా , సీపీఐ గ్రామ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. భీమయ్య మృతి పట్ల సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంటకరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీచైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, బోయిన అశోక్, చాడ శ్రీధర్‌రెడ్డి సంతాపం తెలిపారు.

జ్యోతిబాపూలే గురుకులంలో ఫుడ్ పాయిజన్

● 28 మంది విద్యార్థినులకు అస్వస్థత ● విచారణకు ఆదేశించిన అదనపు కలెక్టర్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు


ఆవేదన వ్యక్తం చేస్తున్న తల్లి


విద్యార్థి నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

గణేశ్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం రాత్రి ఫుడ్ పాయిజన్‌తో 28మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధ పడ్డారు. దీంతో వసతిగృహ అధికారి, సిబ్బంది వారిని సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అస్వస్థతకు గురైన వారిని పరిశీలించిన వైద్యులు ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏమైందోనంటూ బోరున విలపించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. చికిత్స అనంతరం కోలుకున్న విద్యార్థినులకు హాస్టల్‌కు పంపించారు. అస్వస్థతకు గురైన వారికి సెలవులు ఇచ్చి, ఇళ్లకు పంపించారు. మెనూ ప్రకారం సోమవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బబ్బెర్లు ఉడికించి స్నాక్స్‌గా అం దించారు. అనంతరం రాత్రి భోజనంలో క్యాలీఫ్లవర్ కూరతో పాటు సాంబర్ అందించారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు మొదలైనట్లు బాధిత విద్యార్థులు తెలిపారు. విద్యార్థులకు సాయంత్రం పూట అందించిన స్నాక్స్, భోజనం కొంతమందికి పడకపోవటంతోనే ఫుడ్ పాయిజన్ అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గురుకులంలో 411మంది విద్యార్థులు ఉన్నారు.

● ఆహార పదార్థాలను తనిఖీ చేసిన అధికారులు

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో, బీసీడీవో, డీఎంహెచ్‌వో, ఆహార తనిఖీ అధికారులు గురుకుల హాస్టల్‌కు చేరుకుని ఆహార పదార్థాలు తనిఖీ చేశారు. శాంపిళ్లు సేకరించి, పరీక్షల కోసం తమ వెంట తీసుకెళ్లారు. సోమవారం రాత్రి వండిన క్యాలీఫ్లవర్స్ నాలుగు రోజుల క్రితం వచ్చాయని తెలిసింది.

● విద్యార్థి సంఘాల ఆందోళన

ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. రెండో పట్టణ సీఐ సృజన్‌రెడ్డి అక్కడికి చేరుకొని నచ్చజెప్పారు. గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి అంజలితో పోలీసులు వివరణ ఇప్పించారు. సంఘటనపై విచారణకు ఆదేశించినట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ వివరణ ఇచ్చారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరా

భగత్‌నగర్: కరీంనగర్‌లోని జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో జరిగిన ఫుడ్ పాయిజన్‌పై కేంద్ర హోం శాఖసహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరా తీశారు. ఢిల్లీ నుంచి కలెక్టర్ పమేలాసత్పతితో ఫోన్‌లో మాట్లాడారు. క్యాబేజీ తినడం వల్ల విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురయ్యారని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని, ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని కలెక్టర్ తెలిపారు.

గోదావరిఖనిలో మెడికల్ అసిస్టెంట్‌పై హత్యాయత్నం

కోల్‌సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రాంనగర్‌లోని కోదండ రామాలయం కాంపౌండ్‌లో గల సింగరేణి క్వార్టర్లలో మంగళవారం పరాంకుశం యశ్వంత్(36)పై గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. యశ్వంత్ భార్య ప్రతిమ సింగరేణి ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నారు. సాయంత్రం 3గంటలకు ఆమె ఇంటికి వచ్చేసరికి వంట రూమ్ వద్ద భర్త యశ్వంత్ తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో ఉన్నాడు. అతన్ని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ మెడికల్ అసిస్టెంట్‌గా యశ్వంత్ పనిచేస్తున్నాడు. ఇంటి వద్ద ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్‌గా సేవలందిస్తున్నాడు. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఇంటి వెనుకవైపు నుంచి లోనికి చొరబడ్డ దుండగులు అతన్ని వంట రూము వరకు తీసుకెళ్లినట్టు దాడి చేసినట్టు భావిస్తున్నారు. అతని తలకు, ముఖం భాగాలో తీవ్ర రక్త గాయాలున్నాయి. గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది ఘటన స్థలాన్ని పరిశీలించారు. యశ్వంత్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ భూమేష్ పేర్కొన్నారు.

బేకరీలో అధికారుల తనిఖీలు

కోరుట్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూర్ అయ్యంగార్ బేకరీ, కోరుట్ల మిల్క్ హౌస్‌లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. గడువు మించి తినుబండారాలు నిల్వ ఉంచినందుకు రూ. 6 వేల జరిమానా విధించారు. తినుబండారాలు గడువు లోపు మాత్రమే విక్రయించాలని, ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలని హెచ్చరించారు. సందర్భంగా సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలె అశోక్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

వేములవాడలో ప్రైవేటు ఆస్పత్రి సీజ్

వేములవాడ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని చాణక్య నర్సింగ్ హోమ్‌ను అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన నిబంధనలు పాటించడం లేదని, తగిన భద్రతా ప్రమాణాలు లేవని స్థానిక అధికారులు సమర్పించిన నివేదిక మేరకు చాణక్య నర్సింగ్ హోమ్‌ను సీజ్ చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రజిత, వేములవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్.రాజేశ్వర్, వేములవాడ పురపాలక సంఘం కమిషనర్ అన్వేష్ మంగళవారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకొని కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు. ఆస్పత్రి సీజ్ చేయడానికి గల కారణాలు ఏమిటని నిర్వాహకులు అధికారులను ప్రశ్నించారు. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా ఏకంగా ఆస్పత్రి సీజ్ చేయడానికి రావడం ఏమిటని నిలదీశారు. సీజ్ ఉత్తర్వులు తీసుకోవడానికి నిరాకరించారు. పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఆస్పత్రిని సీజ్ చేయడానికి ఒప్పుకోబోమని అడ్డుగా నిలిచారు. వాదోపవాదాల అనంతరం సీజ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల కాపీని ఆస్పత్రి గోడకు అంటించారు. ఆస్పత్రిలో ఉన్న రోగులను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రైల్వే లైన్ల మధ్య రెండు నెలల పసికందు


శిశు సంక్షేమ అధికారులకు బాలుడిని అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సీఐ

పెద్దపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రం సమీపంలో మంగళవారం తెల్లవారు జామున రైల్వే లైన్ల మధ్య రెండు నెలల పసికందు కనిపించింది. కూనారం రైల్వే గేటు సమీపంలో ట్రాక్‌మెన్ షబ్బీర్ పనిచేస్తుండగా రెండు రైల్వే లైన్ల మధ్యలో మగ శిశువు కనిపించడంతో రామగుండం ఆర్పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడికి చేరుకున్న సీఐ పసి కందును పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. సూపరింటెండెంట్ శ్రీధర్ చిన్నారికి చికిత్సను అందించారు. ఏడవడం వల్ల గ్లూకోస్ లెవల్స్ తగ్గాయని, ప్రస్తుతం బాబు ఆరోగ్యం కుదుట పడిందని తెలిపారు. శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు చిన్నారిని తీసుకెళ్లి సంరక్షణ చర్యలు చేపట్టారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో ఏడాది జైలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 7(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నేరం రుజువు కావడంతో మహారాష్ట్రలోని పర్బణి జిల్లా ఎంఎం పహాడీ మండలం సులేమాన్‌నగర్‌కు చెందిన షేక్ ఖయ్యుం అలియాస్ రఫీక్‌బేగ్‌కు అనే యువకుడికి ఏడాది కఠిన కారాగార శిక్షతోపాటు రూ.200 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సృజన తీర్పు వెల్లడించారని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లిలోని పిల్లి రణధీర్ 8 అక్టోబరు 2023న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల వద్దకు వెళ్లారు. తాళం పగులకొట్టి ఇంట్లోని రూ.2లక్షల నగదు, తులం బంగారు ఆభరణాలు దొంగ లు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం మహారాష్ట్రలోని షేక్ ఖయ్యూం అలియాస్ రఫీక్‌బేగ్‌ను రిమాండ్‌కు తరలించారు.

మిర్చి రైతు విలవిల

● రోజు రోజుకు ధర తగ్గుతుండడంతో ఆందోళన

హుజూరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం మిర్చి ధర ఎక్కువగా ఉండడంతో ఈ సారి మెట్ట ప్రాంత రైతులు మిర్చి పంటను సాగు చేశారు. రోజు రోజుకు వరంగల్ మార్కెట్‌లో ధర తగ్గుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. డివిజన్‌లో 1.10 లక్షల ఎకరాల్లో రైతులు వ్యవసాయం చేస్తున్నారు. అందులో 90వేల ఎకరాల వరకు వరి, 10వేల ఎకరాల్లో మొక్కజొన్న, పత్తితో పాటు ఇతర పంటలను సాగు చేస్తారు. సైదాపూర్, హుజూరాబాద్, శంకరపట్నం, ఇల్లందకుంట మండలాల్లోని కొంత భాగం మెట్ట ప్రాంతం ఉండడంతో అక్కడి రైతులు మిర్చి పంటను సుమారు 150ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మిర్చి క్వింటాల్‌కు గత సంవత్సరం 18 వేల రూపాయల ధర పలికింది. దీనిని చూసిన కొంత మంది రైతులు మిర్చిని సాగు చేస్తున్నారు. మిర్చి పంటకు పెట్టుబడి బాగా అవసరం ఉంటుందని రైతులు అంటున్నారు. మొక్క నాటినప్పటి నుంచి కాయ దశ వరకు వారానికి ఒకసారి పురుగు మందులను పిచికారి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం మిర్చి పంట చేతికందే సమయంలో దరలు తగ్గుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. 15 రోజుల క్రితం వరకు వరంగల్ మార్కెట్‌లో క్వింటాల్ మిర్చికి 17 వేల రూపాయల వరకు ధర పలికింది. వారం రోజులుగా 14 వేల నుంచి 14,500 రూపాయలకు పడిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


హుజూరాబాద్ మండలం కాట్రపల్లి శివారులో సాగు చేస్తున్న మిర్చి పంట

పోరు కన్నా ఊరు మిన్న..

మన ఊరుకు తిరిగి రండి

● అజ్ఞాత మవోయిస్టులకు ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపు

సిరిసిల్ల క్రైం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): 'పోరు కన్నా ఊరు మిన్న.. మన ఊరుకు తిరిగి రండి' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అజ్ఞాత మవోయిస్టులకు పిలుపునిచ్చారు. జిల్లాలోని అజ్ఞాత మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరుతూ వారి కుటుంబ సభ్యులను కలిసి విన్నవించేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లిలోని అజ్ఞాత నక్సలైట్, మావోయిస్టు కేంద్రకమిటీ ప్రతినిధి కడారి సత్యనారాయణరెడ్డి ఇంటికి ఎస్పీ వెళ్లారు. మావోయిస్టు సత్యనారాయణరెడ్డి కుటుంబసభ్యులను కలిసి పండ్లు అందజేశారు. అజ్ఞాతంలో ఉన్న సత్యనారాయణరెడ్డి జనజీవన స్రవంతిలో కలవాలని చెప్పారు. సరెండర్ ద్వారా ప్రభుత్వం అందించే పునరావాసం, ఇతర సదుపాయాలను కుటుంబసభ్యులకు వివరించారు. అంతకుముందు జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సెలింగ్ సెషన్ ఏర్పాటు చేశారు. ఇటీవల సరెండరైన మాజీ మావోయిస్టు నేరేళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్కను కార్యాలయానికి పిలిచి ప్రభుత్వం అందించే పునరావాసం, ఇతర సదుపాయాలపై చర్చించారు. అధికారులతో చర్చించి పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు.

అటవీ భూములు అన్యాక్రాంతం

● సాగు పేరుతో కబ్జా
● చెట్లను నరికేసి విద్యుత్ స్తంభాల ఏర్పాటు
● చర్యలు తీసుకోని అధికారులు


రంగరావుపేట శివారులో చదును చేసిన అటవీ భూమి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అటవీ సంపద కనుమరుగవుతోంది. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏళ్లతరబడి రైతులకు భూ యాజమాన్య హక్కుల్లో స్పష్టత లేక యథేచ్ఛగా భూముల కబ్జాకు పాల్పడుతున్నారు. గ్రామాల శివారులో చెట్లను నరికేసి సాగు చేసుకుంటున్నా అవి అటవీ, రెవెన్యూశాఖలోనివని అధికారులకు స్పష్టత లేకపోవడం గమనార్హం. దీంతో గ్రామాల్లోని అక్రమదారుల వేటుకు అడవులు కనుమరుగవుతున్నాయి. కబ్జాలను తొలగించిన అధికారులు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడటం లేదు.

మండలంలోని రంగరావుపేట బీట్ పరిధిలోని ఆత్మకూర్, ఆత్మనగర్, రామలచ్చక్కపేట, కేసీఆర్‌తండా, పాటిమీదతండా


పాటిమీదితండా అటవీ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభాన్ని తొలగిస్తున్న ట్రాన్స్‌కో, అటవీ అధికారులు

గ్రామాల శివారులో పలువురు అటవీ భూముల అక్రమణకు పాల్పడుతున్నారు. అన్ని వ్యవసాయ భూములుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో జేసీబీ, బ్లెడ్ ట్రాక్టర్ల సహాయంతో రాత్రికి రాత్రే భూములను చదును చేస్తున్నారు. వాటిని కొందరు సాగు చేస్తున్నా, మరి కొందరు గిరిజనులకు భవిష్యత్‌లో ప్రభుత్వం పట్టాలు ఇస్తుందని మభ్యపెడుతూ ఏకంగా అమ్మకాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎవరైనా ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే అధికారులు పర్యవేక్షిస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల ఓ ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ఏసీబీకి చిక్కడమే దీనికి ఉదాహరణ. గత ప్రభుత్వ కాలంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నందున ఆక్రమణదారులు అటవీ భూములను కబ్జా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామస్థులు జిల్లా అధికారులకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో అటవీ, ట్రాన్స్‌కో శాఖ అధికారులు పర్యటించి కబ్జా చేసిన భూమిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను తొలగించారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భూములు కబ్జా పాలవుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● **సాగుకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు..**

మండలంలోని ఆత్మకూర్, పాటిమీదతండా గ్రామాల శివారులోని అటవీ భూముల్లో కొందరు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆత్మకూర్, పాటిమీదితండా, ఆత్మనగర్ శివారుల్లోని అటవీ భూములను ఆనుకొని కొన్ని సర్వే నంబర్లలో ప్రభుత్వ అసైన్డ్ భూములను పేదలకు కేటాయించింది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అటవీ భూముల్లోకి చొరబడి ఆక్రమిస్తున్నారు. వీటి మధ్య రెవెన్యూ, అటవీ శాఖల మధ్య హద్దుల స్పష్టత లేదు. సుమారు వందల హెక్టార్లకు పైగా ఆక్రమించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు.

అడవిలో చెట్లను నరికేసిన కబ్జాదారులు...

మండలంలో అటవీ ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉంది. రంగరావుపేట, ఆత్మకూర్ కంపార్ట్‌మెంట్ 611/13 పరిధిలో అటవీశాఖ లెక్కల ప్రకారం 2926.47 హెక్టార్లలో అటవీ భూమి విస్తరించి ఉంది. ఇప్పటికే పోడు భూముల పేరిట వేలాది ఎకరాల అటవీ భూమి ఆక్రమణకు గురి కాగా, కొందరు కలప కోసం, మొరం కోసం అక్రమ వ్యాపారస్థులు గుట్టల్లో తవ్వకాలు చేపట్టడంతో అటవీ సంపద తరిగిపోతూ వచ్చింది. రంగరావుపేట పరిధిలో కొందరు జేసీబీ, ట్రాక్టర్లతో చదును చేసి కబ్జాకు పాల్పడుతున్నారు. వాటిని అమాయకులైన గిరిజనులకు మభ్యపెట్టి ఎకరానికి రూ. 3లక్షల నుంచి 6లక్షల వరకు విక్రయాలు చేస్తూ ప్రభుత్వ ఆస్తిని కొల్లగొట్టుతున్నారు.


పాటిమీదితండా శివారులో చదును చేసిన భూమిని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కొండగట్టు ఈవోగా శ్రీకాంత్‌రావు

● నాలుగు రోజుల క్రితం వేములవాడ ఈవోగా బాధ్యతలు


శ్రీకాంత్‌రావు

మల్యాల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కొండ గట్టు అంజనేయస్వామి దేవస్థానం ఈవోగా వరంగల్ దేవాదాయశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.శ్రీకాంత్‌రావును నియమిస్తూ మంగళవారం దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు ఈవో రామకృష్ణారావు సికింద్రాబాద్‌లోని గణేశ్ ఆలయానికి బదిలీ కాగా ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నాలుగు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు వేములవాడ ఈవో వినోద్ బాధ్యతలు చేపట్టారు. వినోద్ బాధ్యతలు చేపట్టి నాలుగు రోజులు గడవక ముందే మళ్లీ శ్రీకాంత్‌రావును ప్రభుత్వ ఉత్వర్వుల మేరకు దేవాదాయశాఖ అధికారులు కొండగట్టు ఈవోగా నియమించారు.

కరీంనగర్‌లో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బండి సంజయ్ వినతి

కరీంనగర్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో టెక్నికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. మంగళవారం ఢిల్లీలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు, మరో కేంద్ర మంత్రి గజేంద్ర షేకావత్‌ను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించేందుకు పీఎంశ్రీ పథకం కింద కరీంనగర్ జిల్లాలో ఎంపిక చేసిన 24 ప్రభుత్వ పాఠశాలలు, సిరి సిల్ల జిల్లాలో 16పాఠశా లల్లో ప్రతి పాఠశాలకు 40 లక్షల రూపాయల చొప్పున నిధులు అందించాలన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు అవసర మైన కేంద్ర ప్రభుత్వ సహకారం అందిస్తామని మంత్రి వెల్లడించారు.

● **పీవీ గడ్డపై నవోదయ విద్యాలయం**

పీవి నర్సింహారావు పుట్టిన గడ్డ వంగరలో నవోదయ విద్యాలయాన్ని కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో నవోదయ విద్యాలయ ఏర్పాటు చేయాలని భావిస్తోందన్నారు. న్యూఢిల్లీలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన 18 జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు స్థాపించాలని రాష్ట్రం కోరిందన్నారు.


కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న బండి సంజయ్

సంక్రాంతికి ఆర్టీసీ అదనపు బస్సులు

భగత్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 770 బస్సులు, 16 నుంచి 22వ తేదీ వరకు 970 అదనపు బస్సులు నడిపిస్తున్నామన్నారు. ప్రయాణికులు ఈ అదనపు బస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం సూచించారు.

జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు..		కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు	
తేదీ	బస్సులు	తేదీ	బస్సులు
7వ తేదీ	35	16న	180
8న	35	17న	145
9న	40	18న	145
10న	165	19న	190
11న	165	20న	150
12న	165	21న	80
13న	165	22న	80
మొత్తం	770	మొత్తం	970

డిజిటల్ ఇండియా వైపు దూసుకుపోతున్న భారత్

● ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ తర్వాత భారతదేశం డిజిటల్ ఇండియా వైపు శరవేగంగా దూసుకుపోతోందని, దానిలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పాత్ర కీలకమని శాతవాహన యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ చాలెంజర్స్ ఇన్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 140 పరిశోధన పత్రాల వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశంలో డిజిటల్ చెల్లింపులు పెరిగాయన్నారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధన పట్ల ఆసక్తి పెంచుకుంటూ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. జాతీయ సదస్సు వైస్ చైర్మన్ టి రాజయ్య మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు వచ్చినట్లు వీటిని అంతర్జాతీయ జర్నర్‌లో ప్రచురించనున్నట్లు తెలిపారు. సదస్సు నిర్వహణ కార్యదర్శి డాక్టర్ ఎం మల్లారెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 180 మంది ఔత్సాహిక పరిశోధకులు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ వాణిజ్య, వ్యాపార రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీస్ ఉపయోగించి వ్యాపార కార్యకలాపాలను సులభంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం ప్రొఫెసర్ ప్యాట్రిక్ ఆంథోనీ మాట్లాడుతూ ఈ కామర్స్‌లోని అధునాతన పోకడలు, సవాళ్లను వివరించారు. శాతవాహన విశ్వవిద్యాలయ కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగ ప్రిన్సిపాల్ డాక్టర్ డీ హరికాంత్ మాట్లాడుతూ బీమా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించి బీమా క్లైములు ఏ విధంగా పరిష్కరిస్తున్నారో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పి.నితిన్, టి.రాజయ్య, అటానమస్ సమన్వయకర్త డాక్టర్ వి శ్రీనివాస్, అధ్యాపకులు డాక్టర్ ఆర్ రామకృష్ణ, డాక్టర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ హర్జీత్‌కౌర్ పాల్గొన్నారు.

నలిమెల భాస్కర్‌కు పీవీఎన్‌ఆర్ స్మారక పురస్కారం

కరీంనగర్ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పీవీ నరసింహారావు మెమోరియల్ ఫౌండేషన్ వారి పీవీఎన్‌ఆర్ స్మారక పురస్కారాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ నలిమెల భాస్కర్ అందుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా నలిమెల భాస్కర్‌కు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా భాస్కర్-సావిత్రి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీవీ తనయుడు ప్రభాకరరావు మాట్లాడుతూ భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావును పోలిన బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో పీవీ సోదరుడు రామేశ్వరరావు, శరత్‌బాబు, అన్నవరం దేవేందర్, నగునూరి శేఖర్, పొన్నం రవిచంద్ర, గాజోజు నాగభూషణం, బూర్ల వేంకటేశ్వర్లు, వేముల సత్యనారాయణ, నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న నలిమెల భాస్కర్


హుండీ లెక్కిస్తున్న భక్తులు

రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.1.28 కోట్ల ఆదాయం లభించింది. దేవస్థానం హుండీలను మంగళవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అధికారులు, సిబ్బంది లెక్కించారు. గత ఏడు రోజులకుగాను ఆలయ ఖజానాకు రూ.కోటి 28 లక్షల 78 వేల 106 నగదు సమకూరినట్లు, 305 గ్రాముల బంగారం, 8 కిలోల 200 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఎస్పీఎఫ్ అధికారి కరణ్‌సింగ్ పర్యవేక్షించారు.

మల్కపేట రిజర్వాయర్‌కు నీటి విడుదల


మల్కపేట రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు

కోనరావుపేట, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటిని నింపే ప్రక్రియ మంగళవారం ప్రారంభించారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామ శివారులో మూడు టీఎంసీల మల్కపేట రిజర్వాయర్ ను ఈ మధ్యనే పనులు పూర్తి చేసి ఒక టీఎంసీ గతంలో నీరు నింపారు. వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి రైతులు తీసుకపోవడంతో స్పందించిన ఆయన ఒక టీఎంసీ నీరు నింపేందుకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఎత్తిపోతల ద్వారా భారీ మోటార్లను ప్రారంభించి నీటిని రిజర్వాయర్‌లో ఎత్తిపోస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటిని నింపుతుండడంతో మండలవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చేపల మార్కెట్ లేక ఇబ్బందులు

● రాజీవ్ రహదారికి ఇరు వైపులా విక్రయం
● వాహనాలు రోడ్డుపై నిలుపుతుండడంతో ప్రమాదాలు

తిమ్మాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయం పరిసరాల్లో మత్స్యకారులు చేపలు పట్టుకొని విక్రయించి కుటుంబాలను పోషించుకుంటారు. పట్టిన చేపలు అమ్మేందుకు మార్కెట్ లేక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలుగునూర్ శివారులో రాజీవ్ రహదారిని ఆనుకొని వంద వరకు గంగపుత్రుల కుటుంబాలు ఉన్నాయి. వీరు పూర్తిగా చేపల వేటపై ఆధారపడి జీవిస్తుంటారు. దిగువ మానేరు జలాశయంతో పాటు కాకతీయ కాలువలో ఇక్కడి మత్స్యకారులు చేపలు పడుతుంటారు. తాజాగా లభించే ఇక్కడి చేపలకు మంచి డిమాండ్ ఉంది. వాటిని అమ్ముకునేందుకు మార్కెట్ లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఇంటి వద్దనే చేపలను విక్రయిస్తుండగా, మరి కొందరు కరీంనగర్‌లోని మార్కెట్‌కు వెళ్లి చేపలను అమ్ముకుంటున్నారు. ఇంకొందరు రాజీవ్ రహదారి పక్కల దుకాణాలు పెట్టుకుని చేపలు అమ్ముకుంటారు. కొనుగోలు దారులు రోడ్డుకు పక్కన వాహనాలు నిలపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై అతివేగంగా వచ్చే వాహనాలు చేపల విక్రయాలు చేస్తున్న వారిపై దూసుకువెళ్ళిన సంఘటనలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపల మార్కెట్ ఏర్పాటుకు ఒకటి రెండు చోట్ల స్థలాన్ని పరిశీలించినా అది కార్యరూపం దాల్చలేదు. పాలకులు ఇచ్చిన హమీలు కూడా నెరవేరలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.


రాజీవ్ రహదారి పక్కన చేపలు విక్రయించేందుకు ఏర్పాటు చేసుకున్న గొడుగు

రాజీవ్ రహదారి రోడ్డు పక్కన చేపల విక్రయాల కోసం ఏర్పాటు చేసుకున్న గుడిసె

చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది

- భాగ్య, చేపల కాలనీ, అలుగునూర్



చేపలు అమ్ముకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పక్కన ఎండలో కూర్చుని అమ్ముకుంటున్నాం. కరీంనగర్‌కు పోతే ధర గిట్టు బాటు కాదు. ఆటో ఖర్చులు, మార్కెట్‌లో కూర్చోనెందుకు స్థలం లేక ఇబ్బందిగా ఉంటుంది. రోడ్డు పక్కన కూర్చోంటే వచ్చే పోయేటోళ్లు ఆగి చేపలను కొంటారు. ఇక్కడ అందరికి కలిపి ఒక చేపల మార్కెట్ ఉంటే బాగుంటుంది.

చేపలు అమ్మడం ఇబ్బందిగా ఉంది..

- కనకయ్య, మత్స్యకారుడు, చేపల కాలనీ, అలుగునూర్



తెల్లవారి లేచి వేటకు వెళ్లి చేపలు పట్టుకువచ్చే దానికన్నా వాటిని విక్రయిండం ఇబ్బందిగా ఉంది. రోడ్డు పక్కన చెట్ల నీడలో కూర్చుని చేపలు అమ్ముకుంటున్నాం. అందరికీ అనువైన స్థలంలో చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

వార్డు ఆఫీసర్ విధులకు ఆటంకం

● కేసు నమోదు

కరీంనగర్ క్రైం జనవరి7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న అనూష విధులను ఆటంకపరిచి, ఆమె సెల్‌ఫోన్‌ను ధ్వంసం చేసిన కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన తిరుమలా కరుణాకర్‌పై కేసు నమోదు చేశామని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. మంగళవారం మారుతీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్లు సర్వే విధులు నిర్వహిస్తున్న అనూష ఫొటో తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తుండగా కరుణాకర్ అనే వ్యక్తి ఆమె వద్దకు వచ్చి దూషిస్తూ ఫొటోలు ఎందుకు తీసుకుంటున్నావంటూ ఆటంకం కలగించాడని తెలిపారు.

అనంతరం అనూష వద్ద ఉన్న 25 వేల విలువైన సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కుని ధ్వంసం చేశాడని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల శివారులో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన గర్రెపల్లికి చెందిన సంపంగి రవిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రవిని కానిస్టేబుల్ అడ్డుకున్నాడన్నారు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

ఈత మొక్కల పరిశీలన

పాలకుర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జయ్యారం గ్రామంలో గౌడ కులస్తులు నాటిన ఈత మొక్కలను అకారణంగా తొలగించారనే ఫిర్యాదు మేరకు మంగళవారం ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పరిశీలించారు. మొక్కలను తొలగించిన వ్యక్తులను కార్యాలయానికి పిలిపించి దర్యాప్తు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పాఠశాల సిబ్బంది, ఎంఈవో సిరిమల్ల మహేష్, కాంప్లెక్స్ హెచ్ఎం సునీత మంగళవారం సన్మానించారు.ఉపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య, ఎడ్ల విజయలక్ష్మి, కర్రు సమతలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోయల్కర్ స్వప్న, మాధవి, చెన్నూరి భారతి, శైలజ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

రామగిరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేగంపేట్ సెక్షన్ పరిధిలోని రత్నాపూర్ రైతు వేదికలో ఈనెల 9న రైతు విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏఈ మహేందర్ తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులు, వోల్టేజీ డ్రాపింగ్స్, డిస్ట్రిబ్యూషన్ పెంపుదల, లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసుల పేరు మార్పు, కేటగిరి మార్పు తదితర అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సుల్తానాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంబయ్యపల్లి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీటీఎఫ్‌కు చెందిన క్యాలెండర్లను జిల్లా ప్రధాన కార్యదర్శి బండిపల్లి పరుశరాములు ఆవిష్కరించారు. సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొటున్న సమస్యల గురించి వివరాలు నమోదు చేసుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్ అర్కాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీగిరి శ్రీనివాస్, ఆడెపు రాంనారాయణ, కార్యదర్శి మండల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముత్తారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్యాపూర్ ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో చేరడానికి, 7నుంచి 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి శ్రీధర్‌బాబుతోనే అభివృద్ధి

మంథని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోనే మంథని ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంథని మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణం, పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ముందుగా పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికి శాలువాతో సత్కారించారు.

పరామర్శ

మంథని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మంథని ప్రథమ శాసన సభ్యులు దివంగత గులకోట శ్రీరాములు కోడలు రాదమ్మ భర్త గులుకోట శ్రీనివాసులు, న్యాయవాది సతీమణి ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను మంగళవారం మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు.

దశలవారీగా హామీల అమలు..

- ఎనభై శాతం రుణమాఫీ పూర్తి
- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో తాము ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం దశలవారీగా వాటిని అమలు చేస్తుందని, ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎనభై శాతం మేరకు రుణమాఫీ జరిగిందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాములను భవనాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ జరిగి తిరిగి రైతులకు రుణాలు ఇచ్చినా కూడా విపక్షాలు కావాలని దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. మండలంలోని పలు ప్రధాన రోడ్లను అభివృద్ధి చేసేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ఇందుకుగాను దాదాపు ఎనభై కోట్ల రూపాయలు అవసరం ఉంటుందని అంచనా వేశామన్నారు. కనీసం ప్రభుత్వం నుంచి నలభై కోట్లు వచ్చేలా కృషి చేస్తానని, ప్రధాన రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తామన్నారు. రైతు కూలీలకు ఏడాదికి ఆరు వేల చొప్పున, భూమి లేని వారికి నెలకు వెయ్యి చొప్పున ఏడాదికి పన్నెండు వేల రూపాయల చొప్పున జనవరి 26 నుంచి మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. కనుకుల సహకార సంఘం ప్రహరీగోడ కోసం నిదులు మంజూరు చేయాలని వైస్‌చైర్మన్ కొమ్మిడి వెంకటరమణారెడ్డి, డైరక్టర్లు ఫైలారం నారాయణ తదితరులు ఎమ్మెల్యేను కోరారు. తొగర్రాయి, కనుకుల రామునిపల్లి, రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని కోరారు. డబుల్ రోడ్ల నిర్మాణం చేసి రవాణా వ్యవస్థను పటిష్టం చేస్తామని సుల్తానాబాద్ మండలంలో రోడ్ల అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు చెప్పారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సహకార సంఘం చైర్‌పర్సన్ కోట వీణ రాజు సంఘ అభివృద్ధి నివేదికను చదివి వినిపిం చారు.


కనుకులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, గడ్డం మహిపాల్ రెడ్డి, గాజుల రాజమల్లుతో పాటు సంఘ డైరక్టర్లు, మేనేజర్ శశిధర్ రావు, సీఈవో బొంగోని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల రక్షణ బాధ్యతగా తీసుకోవాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను రక్షించేందుకు గ్రామ అధికారులు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కలిందిని అన్నారు. మంగళవారం మండలంలోని హన్మంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి కలిందిని ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా డిఆర్‌డివో కలిందిని గ్రామంలోని పల్లె ప్రకృతివనాలు, నర్సరీలను పరిశీలించారు. పల్లె ప్రకృతివనాల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలని, ఎండిపోయిన ప్రాంతాల్లో కొత్తగా మొక్కలను నాటాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలను పరిరక్షించాలని, గ్రామాలకు ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. వారి వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో రమేష్‌బాబు, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, రవి, శ్రీకాంత్‌లతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ ధర్నా


నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎలిగేడు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతువ్యతిరేక విధానాలకు పాల్పడుతోందంటూ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌక్‌లో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాచేపట్టి సీఎం డౌన్‌డౌన్ ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలుచేస్తూ రైతుభరోసా రూ.12నుంచి రూ.15వేలు, పూర్తిస్థాయిలో రైతుబంధు, సన్నవడ్లకు బోనస్ చెల్లించాలని నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారకరామారావు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిల పిలుపు మేరకు ప్రతి కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు. కాగా ధర్నా చేసి రోడ్డును దిగ్బంధించగా పోలీసులు వచ్చి వారిని బయటకు లాగి రోడ్డును క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు బోయిని సతీష్‌యాదవ్, నాయకులు తంగెళ్ల కుమార్‌యాదవ్, బద్దం తిరుపతిరెడ్డి, గొల్లె లక్ష్మణ్, కవ్వంపల్లి బాపయ్య, బాసంపల్లి రాజేష్, జల్లి రమేష్, బాసంపల్లి వినోద్, వివిధ గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మీడియా హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

- ప్రజా సంఘాల నాయకులు


నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, జర్నలిస్టులు

పెద్దపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మీడియా హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్‌లో హత్యకు గురైన జర్నలిస్టు చంద్రకార్‌కు పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నివాళులర్పించారు. జర్నలిస్టు ముకేష్ చంద్రకార్ హత్యను ఖండించారు. ఘటనపై సీబిఐ విచారణ జరపాలని, జర్నలిస్టు కుటుంబానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. టీయుడబ్ల్యూజె దాడుల నివారణ కమిటీ జిల్లా కన్వీనర్ సీపెల్లి రాజేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతకింది చంద్రమొగిలి, నారాయణదాసు అశోక్, ఉపాధ్యక్షుడు వీరమల్ల విద్యాసాగర్‌రావు, టీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ముదిమడుగుల మల్లన్న, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకుడు, సామాజిక ఉద్యమకారుడు ఎరుకల రాజన్న, విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, తెలంగాణ పీపుల్స్ జేఏసీ నాయకులు పొన్నం రాజమల్లయ్య, టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, కోకన్వీనర్ గాండ్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని, దేశంలో నానాటికి పత్రికా స్వేచ్ఛ దిగజారుతున్నదని, దీంట్లో భాగంగానే చంద్రకర్ హత్య జరిగిందని తెలంగాణ ప్రజాఫ్రంట్ కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, గాండ్ల మల్లేష్‌లు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్లో 120 కోట్ల రూపాయల రహదారి నిర్మాణంలో జరిగిన అవినీతి అక్రమాలను వెలికితీసినందుకే ఫ్రీలాన్స్ జర్నలిస్టు ముకేశ్ చంద్రకర్ హత్య చేశారని, మృతుడు కుటుంబానికి 10 కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

'ఎల్లంపల్లి' భూముల కబ్జాపై కదులుతున్న డొంక..

(5వ పేజీ తరువాయి)

వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు నీటి పారుదల శాఖాధికారులు సిద్ధం అవుతున్నారు. ఇదివరకే ఫిర్యాదు చేసినప్పటికీ, పూర్తి వివరాలతో అక్రమార్కులపై మరొక ఫిర్యాదు చేస్తామని ప్రాజెక్టు ఈఈ స్వామి 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ తెలిపారు. అయితే ఈ వ్యవహారం నుంచి తప్పించుకునేందుకు అక్రమార్కులు అధికార పార్టీకి చెందిన ఒకరిద్దరు నాయకులతో పైరవీలు సాగిస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. ఈ అక్రమ దందాకు నీటి పారుదల శాఖాధికారుల ప్రమేయం ఉండిం ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సదరు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం వల్లనే అక్రమార్కులు ప్రాజెక్టు భూములను ఆక్రమించి, నీళ్లు, విద్యుత్‌ను అక్రమంగా వాడుకుని దర్జాగా వ్యాపారం కొనసాగించినట్లు తెలుస్తున్నది. దీనికి బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామగుండంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్

గోదావరిఖని, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఎవరికైనా ఏ ఇబ్బందులున్నా నేరుగా క్యాంపు కార్యాలయానికి వచ్చి తనను కలువవచ్చునని ఆయన సూచించారు. వ్యక్తిగత సమస్యలే కాకుండా అభివృద్ధికి సంబంధించి ఇబ్బందులను తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి సూచనలు కూడా చేయవచ్చునని ఆయన తెలిపారు.

డివిజన్లలో మనాలీ ఠాకూర్ పర్యటన

గోదావరిఖని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో మంగళవారం రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ పర్యటించారు. ఎన్నికల సమయంలో తమ దృష్టికి వచ్చిన సమస్యలు ఎంత వరకు పరిష్కారం అయ్యాయి, ఇంకా ఏ సమస్యలు మిగిలి ఉన్నాయనే విషయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు గఫూర్ ఉన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడికి నిరసన..

పెద్దపల్లిటౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని ఖండిస్తూ స్థానిక బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తంగెడ రాజేశ్వర్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు కావేటి రాజగోపాల్, ఒల్లె తిరుపతి,వేలుంల రమేష్, పేజర్ల రాకేష్, ముంజ రాజేంద్రప్రసాద్, పడాల శ్రీధర్, గుడ్ల సతీష్ కుమార్, మామిడి ఉమేష్, ఆడేపు రమేష్, గాదాసి సతీష్, బొడ్డుపల్లి సంపత్, అంజి మరియు బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

మంథని, రామగిరి మండలాల్లో కలెక్టర్ తనిఖీలు

మంథని/రామగిరి జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో చేపట్టిన మరమ్మతు పనుల పురోగతిపై కలెక్టర్ కోయ శ్రీహర్ష సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మంథని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి, రామగిరి ఎంపీడీవో కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసుపత్రి మరమ్మతు పనుల కోసం కలెక్టరేట్ నిధుల నుంచి ఆసుపత్రికి కలెక్టర్ ప్రత్యేకంగా నిధులు మంజూరుచేశారు. వాటిని వినియోగించుకోని పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం రామగిరి మండలం ప్రజాపరిషత్ కార్యాల యాన్ని తనిఖీ చేపట్టారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఎంత మంది లేబర్ వస్తున్నారు, గ్రామాలలోని నర్సరీలలో బ్యాక్ ఫీలింగ్ ఎంత వరకు పూర్తయింది, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతి సంబంధిత అంశాలను ఆరా తీసి అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

పెద్దపల్లి రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరెడ్డిపేట యూపీఎస్ పాఠశాలను పెద్దపల్లి ఎంఈవో సురేంద్రకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థులకు అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజనం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వెంట ప్రధానోపాధ్యాయుడు సమీ, ఉపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు ఉన్నారు.

కొలనూర్ మండల ఏర్పాటుకు కృషి..


వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

ఓదెల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : కొలనూర్ గ్రామానికి నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని మంగళవారం అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి వినతిపత్రం అందించారు. కొలనూర్ పరిధిలో దాదాపు 11 గ్రామాలు అనుకూలంగా ఉన్నాయని మండల కేంద్రం ఏర్పాటుకు అర్హతలను ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే కొలనూర్‌లో వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రం ఏర్పాటుకు పరిశీలిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, బిజెపి జిల్లా నేత కర్రె సంజీవరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, గుండెటి మధు, మాజీ సర్పంచ్‌లు బోంగోని రాజయ్యగౌడ్, మాటూరి వెంకటస్వామి, సామ శంకర్, దొడ్డె శంకర్, తాజ్, ఐరెడ్డి వెంకటరెడ్డి, రాంరాజ్, సమీపంలోని గ్రామాల నుంచి పలువురు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రథయాత్రకు సంఘీబావం..

అంతర్గాం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రారంభించిన రథయాత్రకు మద్దతుగా రామగుండం అంబేద్కర్ చౌరస్తాలో నాయకులు డప్పుకొట్టి సంఘీబావం ప్రకటించారు. ప్రతి మాదిగ ఒక డప్పు తీసుకోని సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమం లో వడ్డేపల్లి సురేష్ మాదిగ, మానుమండ్ల రమేష్ మాదిగ, బుషిపాక సంతోష్ మహరాజ్, కుక్క గంగాప్రసాద్ మాదిగ, కొండల రాజేందర్ మాదిగ, ఆరుముల్ల సదానందం మాదిగ, కల్వల శ్రీనివాస్ మాదిగ, ఇరికిళ్ళ శంకర్ మాదిగ, ఆరేపల్లి క్రాంతికిరణ్, సుందిళ్ల సదానందం మాదిగ, లంకదాసరి సదానందం మాదిగ, వడ్డేపల్లి రమేష్ మాదిగ, ఈదునూరి సదానందం పాల్గొన్నారు.

చదరంగంపై మక్కువ పెంచడానికి కృషి


మాట్లాడుతున్న గడ్డాల శ్రీనివాస్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : చదరంగంపై మక్కువ పెంచడానికి కార్యవర్గం కృషి చేయాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గడ్డాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని వేదవ్యాస హైస్కూల్‌లో మంగళవారం గడ్డాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గడ్డాల శ్రీనివాస్ మాట్లాడుతూ పెద్దపల్లి పరిసర ప్రాంతాల విద్యార్థులు, ఆసక్తిగల యువతకు ఏకాగ్రతతో పాటు పోటీతత్వాన్ని పెంపొందించే చదరంగంపై మక్కువ పెంచడానికి కార్యవర్గం కృషి చేయాలని తెలిపారు. ఎన్నికల పరిశీల కుడిగా జిల్లా జాయింట్ సెక్రటరీ కేయం సూరజ్‌బాన్సింగ్ వ్యవహరించారు. మండల అధ్యక్షుడు కొక్కిస దేవేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జూపాక ఉమా మహేశ్వర్, ఉపాధ్యక్షుడిగా కోట సద య్య, చింతల దేవామణి, సంయుక్త కా ర్యదర్శిగా మెట్టు శ్రీకాంత్, మెట్టు శ్రీలేఖ, కోశాధి కారిగా గాదర్ల లావణ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వేదవ్యాస పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక మెళకువలు నేర్పి ప్రోత్సహక పోటీని నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన జాలిగం వివేక్, చల్ల కళ్యాణ్, ఉయ్యాల జస్వంత్, కొలగాని మనిద్దీప్, జనగామ రోహన్‌లకు బహుమతులు అందించారు.

సింగరేణి సమాచారం



పని స్థలాలను పరిశీలించిన డైరెక్టర్(పా)


ఓబీ పని స్థలాలను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టు ఓవర్‌బర్డెన్ పనులు నిర్వహిస్తున్న ఆర్వీఆర్ స్థలాలను మంగళవారం డైరెక్టర్(పా) వెంకటేశ్వర‌రెడ్డి పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి ఓబీ పనులను ఆయన పరిశీలించారు. లక్షానికి అనుగుణంగా ఓబీ వెలికితీయకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పని స్థలాను పెంచుకోవాలని, యంత్రాల వినియోగం పెంచేలా దృష్టి సారించాలని ఆర్వీఆర్ ప్రతినిధులకు డైరెక్టర్ సూచించారు. ఓబీ వెలికితీత లక్షానికి అనుగుణంగా జరగకుంటే బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని అన్నారు. డైరెక్టర్(పా) వెంట ఆర్జీ-2 జీఎం వెంకటయ్య, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఆర్జీ రీజియన్ సేఫ్టీ గుప్తా, సర్వే అధికారి నర్సింగరావు, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్ ఉన్నారు.

సాముహిక అనఘాష్టమి వ్రతం

గోదావరిఖని, జనవరి 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బంగ్లాస్ ఏరియాలోని దుర్గామాత ఆలయంలో మంగళవారం ఆర్జీ-1 లేడిస్ క్లబ్ అధ్వర్యంలో సాముహిక శ్రీ అనఘాష్టమి వ్రతం నిర్వహించారు. వేణుగోపాల్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్జీ-1జీఎం లలిత్‌కుమార్, లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అనితలలిత్‌కుమార్ మాట్లాడుతూ దుర్గామాత అమ్మవారి దీవెనలతో అధికారులు ఉద్యోగులు కలిసిమెలసి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామగుండం రీజియన్ జీఎం (భద్రత) కేహెచ్ ఎన్ గుప్తా, ఏసీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్, ఏజంట్ చిలుక శ్రీనివాస్, సివిల్‌క్వాలిటీ నాగేశ్వర్‌రావు, సభ్యులు లలిత, రశ్మి, సూర్య లక్ష్మి, సుధారాణి, నిర్మల, చిలుక లక్ష్మి, స్వరూప, శిరీష, రజిత, సురేఖ, శ్రీ దేవి తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు పట్టివేత

కోల్‌సిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ లక్ష్మీపురం ఏరియాలో ఓసీపీ-3 నుంచి ఎన్‌టీపీసీ రైల్వే వ్యాగన్ల ద్వారా రవాణా అవుతున్న బొగ్గును దొంగిలిస్తున్నారనే సమాచారం మేరకు సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. ఎస్ఎస్ఓ వీరారెడ్డి ఆధ్వర్యంలో జే ఉమేష్, చంద శ్రీనివాస్, అక్బర్ అలీ,జమేదార్ చంద్రగౌడ్, ఇంటలీజెన్స్ టీమ్ తిరుపతి రాధాకృష్ణ, ఎంటీఎఫ్ టీమ్ సంపత్‌కుమార్, కనకరాజు తనిఖీ జరిపారు. 5టన్నుల బొగ్గును స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు

- రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి


బసంత్‌నగర్ వద్ద ఘనస్వాగతం..

గోదావరిఖని, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వమే రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం రామగుండం మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, వైస్‌చైర్మన్ మడ్డి తిరుపతి, డైరెక్టర్లు గోదావరిఖనికి వచ్చి ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కూడా లెక్క చేయకుండా రైతుల రుణమాఫీ చేసిందని, వ్యసాయ భూములన్నింటికి ఎకరానికి రూ.12వేలు, భూమి లేని రైతులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏటా రూ.12వేలు చెల్లించనున్నారన్నారు. అలాగే కొత్త రేషన్‌కార్డులు కూడా జారీ కానున్నాయన్నారు. ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు కూడా చేస్తుందన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు ఘన స్వాగతం

పాలకుర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలం పరిధిలోని బసంత్‌నగర్ బస్టాప్ వద్ద మంగళవారం రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాలిపెల్లి తిరుపతికి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. తిరుపతి ఇటీవల రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికై మొదటిసారిగా గోదావరిఖనికి వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కమాన్‌పూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరపల్లి గ్రామంలో ఆకుల శ్రావణ్, పిట్టల రాజమ్మ, ఆకుల రామయ్య, పోలు దాసరి చంద్రయ్యలు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని సానుభూతి, వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు. కాగా, ఆకుల శ్రావణ్‌కుమార్ కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. శ్రావణ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. వెంట మాజీ వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తోడేటి రాజీర్, ఆకుల కుమార్, తోడేటి రవి, జంజర్ల అనిల్,బొగే తిరుపతి తదితరులు ఉన్నారు.

ముత్తారంలో..

ముత్తారం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జిల్లాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రాజేశం కూతురు సంధ్య ఇటీవల మరణించగా జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం మంగళవారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు వాజీద్‌పాషా, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అల్లం కుమారాస్వామి, మాజీఉప సర్పంచ్ శ్రీకాంత్, శ్రీకాంత్, శంకర్, గట్టయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.